క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల ధర్నా


ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీలో ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో 1/2019 చట్టాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నాణేల ప్రదర్శన


నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న అమిత్ పాండే

ఏలూరు (టూటౌన్): స్థానిక డి పాల్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్‌సీసీ క్యాంపులో ఏలూరు నగరానికి నాణేల సేకరణ కర్త అలీ ఖాన్ మహమ్మద్ నాణేలను ప్రదర్శించారు. నాణేల గురించి ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆలీఖాన్ వివరించారు. ఈ ప్రదర్శనను క్యాంప్ ఆర్మీ కల్నల్ అమిత్ పాండే, క్యాంప్ సూపరింటెండెంట్ మామిళ్ల కొండయ్య, ఉమర్ ఖాన్, మానవతా నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావు, శ్రీహరికోటి, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు ఆర్మీ సుబేదార్ వినోద్ కుమార్, ఆదినారాయణ సిబ్బంది, డి పాల్ విద్యార్థులు, సిబ్బంది తిలకించారు.

ఫీల్డ్ టెక్నీషియన్ - ఎయిర్ కండిషనర్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఫీల్డ్ టెక్నీషియన్ – ఎయిర్ కండిషనర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఈ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపైన ఉత్తీర్ణులైన వారు, 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను మే, 10వ తేదీలోగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డీఎల్‌టీసీ కార్యాలయానికి పంపాలని, వివరాలకు సెల్ నెంబర్ 94934 82414లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

తాగునీరు.. ఆదాయ వనరు

- మినరల్ కాదు.. ఫిల్టర్ నీరే అమ్మకం
- పేటకో వాటర్‌ప్లాంట్
- ట్రస్ట్‌ల ముసుగులో వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నదీ జలాలు, భూగర్భ జలాలు, నూతి నీరు తాగేందుకు ప్రస్తుత ప్రజలు ఇష్టపడడం లేదు. మంచి, పరిశుభ్రమైన నీరుతాగాలని వారు కోరుకుంటున్నారు. నదీ జలాలు, భూగర్భ జలాలు పుష్కలంగా దొరికే ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటికి కొరత ఉండదు. కానీ ఏలూరు పరిసర ప్రాంతాల వాసులకు కార్పొరేషన్ అధికారులు సరఫరా చేస్తున్న తాగునీటిపై నమ్మకం కలగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, లోపించిన పారిశుద్ధ్యం, కలుషిత నీరు, క్లోరినేషన్ చేయని నీటిని సరఫరా చేయడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో మినరల్ వాటర్ తాగేందుకే మొగ్గు చూపుతున్నారు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని మినరల్ వాటర్ వ్యాపారులు ఫిల్టర్ వాటర్‌ను సరఫరా చేస్తూ తమ పంట పండించుకుంటున్నారు. అక్రమార్కులకు ప్రజల తాగునీటి అవసరాలు పెద్ద ఆదాయ వనరుగా మారింది.

అనుమతులపై అనుమానం

నగరంలో దాదాపు ప్రతిపేటలోనూ ఒక వాటర్ ప్లాంట్ ఉంది. ఒక్కొక్క చోట రెండుకు మించి ప్లాంటులు ఉన్నాయంటే ప్రజల అవసరం ఎంతగా ఉందో తెలుస్తుంది. శాంతినగర్ నుంచి మొదలు నరసింహరావు పేట, రామచంద్రరావు పేట, పత్తేబాద, అశోక్ నగర్, కొత్తపేట, ఆదివారపుపేట ఇలా ప్రతి పేటలోనూ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో అనుమతులు ఎన్నింటికి ఉన్నాయో చెప్పగలిగే పరిస్థితి అధికారుల్లో కనిపించడంలేదు. ఈ ప్లాంట్లలో నీటిపైనా ప్రజలు నమ్మకం కోల్పోయి పెద్ద పెద్ద కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న 5 లీటర్లు, 2 లీటర్లు, లీటర్, అర లీటర్ వాటర్ బాటిళ్లను కొంటున్నారు.


నగరంలోని ఒక వాటర్ ప్లాంట్

నిర్వాహకుల ఇష్టారాజ్యం

వివిధ పేటల్లోని వాటర్‌ప్లాంట్లు ఏదో ఒక చారిటబుల్ ట్రస్ట్, స్వచ్ఛంద సేవా సంస్థ పేరుతో రిజిస్టర్ చేసుకుని ప్రజలకు ఉచితంగా, లేదా నామమాత్రపు ధరకు సరఫరా చేయాల్సిన తాగునీటిని వ్యాపార ధృక్పదంతో ఎక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 20 లీటర్ల క్యాన్‌తో నీరు తీసుకెళ్లాలంటే నిర్వాహకులకు రూ.15 నుంచి రూ.20 చెల్లించాల్సి వస్తోంది. వాస్తవానికి ట్రస్ట్‌ల పేరుతో నిర్వహించే ప్లాంట్ల నుంచి ప్రజలకు 20 లీటర్ల క్యాన్ల మినరల్ వాటర్‌ను కేవలం రూ.1, లేదా రూ.2కే అందించాల్సి ఉంది. అయితే దీనిపై అధికారుల నియంత్రణ కొరవడడంతో ప్లాంట్ల నిర్వాహకులు తమ ఇష్టానుసారం ధరలు నిర్ణయించి విక్రయించుకుంటున్నారు.

నిబంధనలకు నీళ్లు

వాటర్ ప్లాంటు ఏర్పాటుకు తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకోవాలి. నీటిని ఫిల్టర్ (శుద్ధి) చేసే పరికరాలన్నీ కలిగి ఉండాలి. ప్లాంట్‌లో ఏసీతో పాటు, ఇద్దరు మైక్రోబయాలజీ, కెమికల్ టెక్నీషియన్లను నియమించుకోవాలి. పరిశ్రమ శాఖ నుంచి పార్టు-1 అనుమతి పొందాలి. భారతీయ ప్రమాణాల(ఐఎస్ఐ)తో కూడిన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. అయితే వాటర్ ప్లాంట్ నిర్వాహకులు వీటిలో కొన్నింటిని మాత్రమే తీసుకొని యథేచ్ఛగా బోరునీటినే ఫిల్టర్ నీరుగా ప్రజలకు విక్రయిస్తూ వ్యాపారాలను కొనసాగిస్తున్నట్టు చెబుతును.

మినరల్ వాటర్ తయారీ ఇలా..

ఒక లీటరు నీటిలో 1,500 మిల్లీ గ్రాముల సంపూర్ణంగా కరిగిన ఖనిజ లవణాలు (మినరల్స్) ఉండాలి. అందులో ఒక మిల్లీ గ్రాము కాపర్, 0.3 మిల్లీ గ్రాముల ఇనుము, 45 మిల్లీ గ్రాముల నైట్రేట్, 200 మిల్లీ గ్రాముల క్లోరైడ్, 250 మిల్లీ గ్రాముల సల్ఫేట్ ఖనిజాల చొప్పున కనిష్ఠంగా ఉండాలి. అదేవిధంగా నీటిని శుద్ధి చేసే శాండ్ (ఇసుక) ఫిల్టరేషన్ యాక్టివేటెడ్ కార్బన్, మిక్స్‌డ్ బెడ్, డీ మినరలైజేషన్ ఫిల్లింగ్ యూనిట్ తదితర పరికరాలు ఉండాలి. ప్లాంట్లలోని నీటిని ప్రతిరోజు లేదా నెలలో ఒకరోజు నీటిని వేర్వేరుగా పరీక్షించి రికార్డులను అధికారులకు అప్పగించాలి. ఖనిజ లవణాల ప్రమాణాలు గుర్తించాలి. అయితే నిర్వాహకులు వీటిని గాలికొదిలేసి, ఆటోలపై ట్యాంకర్లు పెట్టి వివిధ ప్రాంతాలకు తరలిస్తూ జోరుగా నీటి వ్యాపారాలు చేస్తున్నారు.

బోరు నీరే సరఫరా



పైపుల ద్వారా వచ్చే నీరు మురికిగా ఉండడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నీటిని కనీసం వంటకి కూడా వినియోగించే పరిస్థితి లేదు. మినరల్ వాటర్‌ను వినియోగిస్తున్నాం. ప్లాంట్ల నుంచి తెచ్చిన నీటితో అన్నం వండితే రంగు మారిపోతోంది. బోరు నీరయితేనే ఇలా రంగుమారుతుందంటున్నారు. తాగడానికి కూడా ఈ నీటినే వినియోగిస్తున్నాం. అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని భయంగా ఉంది.

– మంతెన భాస్కర్, స్థానికుడు

నిరంతర పర్యవేక్షణ అవసరం



నగరంలో అనేక ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ పేరుతో లక్షల రూపాయల వ్యాపారం జరుగుతోంది. ప్రజలు తమ తాగునీటి అవసరాల కోసం మంచి నీటిని కొనుగోలు చేస్తున్నా అవికూడా సక్రమంగా శుద్ధి చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణతో పాటు ఎప్పటికప్పుడు నీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి.

– గొంతిన రామకృష్ణ.. సామాజిక కార్యకర్త

మూడు చక్రాల బ్యాటరీ వాహనం అందజేత


దివ్యాంగునికి వాహనం అందిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శారీరక విభిన్న ప్రతిభావంతుడైన జంగారెడ్డిగూడెంకు చెందిన వీరవల్లి శంకరరావుకు రూ.65 వేలు విలువచేసే మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని కలెక్టరు పంపిణీ చేశారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో శంకరరావు అర్జీ చేయడంతో కలెక్టరు స్పందించి మూడు చక్రాలు వాహనాన్ని మంజూరు చేసి సోమవారం అందజేశారు. ఈ వాహనం ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కలెక్టరు వెట్రిసెల్వి సూచించారు. ఈ సందర్భంగా శంకరరావు కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ నిరసన

దెందులూరు: ఎంపీటీసీ సభ్యురాలుగా ఎన్నికై 11 నెలలు పూర్తికావస్తున్న గౌరవ వేతనం వేయకపోవడం ఏమిటని చల చింతలపూడి ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి ప్రశ్నించారు. సోమవారం చల చింతలపూడిలో ఆమె నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాద్రి సత్యనారాయణ, వేమన నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి గౌరవ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కె.శ్రీదేవి ప్రజాప్రతినిధుల గౌరవ వేతనం సంబంధించి బిల్లును ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని వివరించారు.

వారపుసంతకు వడదెబ్బ


వారపుసంతలో ఖాళీగా ఉన్న వ్యాపారులు


దుకాణాల ముందు నీటితో తడుపుతున్న దృశ్యం

గణపవరం: రోజంతా కొనుగోలు దారులతో రద్దీగా ఉండే గణపవరం వారపుసంత కొనుగోలుదారులు కనపడక వెలవెల బోయింది. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపు సంతలో బేరాలు లేక వ్యాపారులు బాతాఖానీ కబుర్లతో కాలం గడిపారు. సోమవారం సూరీడు సుర్రుమనడంతో ఎండతీవ్రతకు తాళలేక కొనుగోలుదారులు ఇళ్లనుంచి బయటకు రాలేదు. ఉదయం అరకొరగా సాగిన వ్యాపారం పదిగంటలు దాటే సరికిపూర్తిగా నిలిచిపోయింది. సాయంత్రం 4 గంటల వరకూ ప్రజలు సంతకు రాక పోవడంతో వ్యాపారులు పూర్తిగా ఢీలాపడ్డారు. మధ్యాహ్న సమయంలో ఉష్ణతాపం తాళలేక వ్యాపారులు తమ దుకాణాలముందు బకెట్లతో నీరుతెచ్చి కళ్లాపి చల్లుకుండా కాస్త ఉపశమనం పొందారు. సాయంత్రం సమయానికి కొనుగోలు దారులు రావడంతో వ్యాపారులు బిజీ అయిపోయారు. అయినా 50శాతం మేర మాత్రమే అమ్మకాలు జరిగాయని వ్యాపారులు వాపోయారు.

ఏలూరు డీవైఈఓగా రవీంద్రభారతి


రవీంద్రభారతిని అభినందిస్తున్న ఏపీటీఎఫ్ 1938 నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి (డీవైఈఓ)గా రవీంద్ర భారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న ఏలూరు ఎంఈఓ-1 ఎ.రవిప్రకాష్‌ను ఆయన సొంత స్థానానికి బదిలీ చేశారు. రవీంద్ర భారతి ప్రస్తుతం తాడేపల్లిగూడెం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా, ఉంగుటూరు ఎంఈఓ-1గా పని చేస్తూ ఇక్కడికి వచ్చారు. రవీంద్రభారతిని ఏపీటీఎఫ్ 1938 జిల్లా శాఖ నాయకులు కలిసి అభినందించారు. వీరిలో సంఘ నాయకులు రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ జి.కృష్ణ, పేరాబత్తిన సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మోహన్, ఉపాధ్యక్షులు ఇ.రామ్మోహన్‌రావు, డీయూవీ దుర్గాప్రసాద్, ఎస్‌వీ దుర్గారావు, గుంటూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

పెదవేగి : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని వక్తలు కొనియాడారు. దుగ్గిరాల సెయింట్ డి పాల్ కాలేజీలో 19 ఆంధ్ర బెటాలియన్ ఏటీసీ-1 క్యాంపు జరుగుతుందని నిర్వాహకులు 19(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అమిత్ పాండే అన్నారు. ఈ క్యాంపు ఈ నెల 24 నుంచి మే 3 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎంలు


ఎస్పీ కార్యాలయం వద్ద మూతపడిన ఏటీఎం


చాణుక్యపురి కాలనీ వద్ద ..

ఏలూరు నగరంలో ప్రధాన కూడళ్లలో ఎస్‌బీఐ ఏటీఎంలు గత రెండు నెలలుగా పనిచేయడం లేదు. జనసంచారం, మార్కెట్ ఉన్న ప్రాంతాల్లో ఉన్న ఈ ఏటీఎంలు పనిచేయక పోవపడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎం కార్డు తీసుకుని ప్రైవేటు బ్యాంకులకు వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎంలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు


విజయవిహార్ సెంటరులో..


ఫైర్‌స్టేషన్ సెంటరులో..

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	34	బీన్సచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	38	కంద	--
కాకర కాయలు	30-36	బీట్‌రూట్	28
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	--	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

మన్నా చర్చి ప్రారంభోత్సవం


పాటల సీడీని ఆవిష్కరిస్తున్న బిషప్ జ్యోతిరాజు

దెందులూరు: చాటపర్రు మన్నా చర్చి ద్వారా సువార్త ప్రకటన విశ్వవ్యాప్తం కావాలని, చర్చి మరింత అభివృద్ధి చెందాలని మన్న మినిస్ట్రీస్ బిషప్ ఎం ఎలీషా రాజు, అంతర్జాతీయ వర్తమానికులు ఎం జ్యోతిరాజు అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఆధునికరించిన మన్నా చర్చిని పాస్టర్ ఫినేహాస్ ఆధ్వర్యంలో బిషప్ ఎలీషారాజు ప్రారంభించారు. మన్నా మినిస్ట్రీస్‌లో సువార్త పరిచర్య చేసి ఆధ్యాత్మిక అభివృద్ధి చెందటమే కాకుండా అనేక ప్రాంతాల్లో ఆధ్యాత్మిక అభివృద్ధికి పాస్టర్ ఫినేహాస్ దంపతులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఏడు మాటలపై జ్యోతిరాజు వాక్య పరిచర్య చేశారు. చర్చి అభివృద్ధికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం పాస్టర్‌కు అందించారు. పాస్టర్ ఫినేహాస్ రూపొందించిన నూతన గీతాన్ని బిషప్ జ్యోతి రాజు విడుదల చేశారు.

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ప్రారంభం


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు


చాటపర్రు గ్రంథాలయంలో వేసవి తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను (సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం) ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు అధ్యక్షత వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకాలే మొదటి నేస్తమనానరు. తరచు గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కష్టంగా చదవద్దు.. ఇష్టంగా చదవండి అంటు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన విద్యార్థులందరికీ స్నాక్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, సీనియర్ రీసోర్స్‌పర్సన్ డి.శ్రీవల్లి, డ్రాయింగ్ టీచర్ పి.శంకర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాటపర్రులో..

దెందులూరు: చాటపర్రు గ్రంథాలయంలో సోమవారం పాఠశాల విద్యార్థుల కు సమ్మర్ క్లాసులను గ్రంథాలయ అధికారి వాసుకి ప్రారంభించారు. రిటైర్డ్ హెచ్ఎం ఒ.సుబ్బారావు, రిటైర్డ్ ఉద్యోగి మహేష్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి విద్యార్థులతో మాట్లాడారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటిరోజు 24 మంది శిక్షణకు విచ్చేశారని గ్రంథాలయాధికారి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం


మాట్లాడుతున్న ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాకర్ అన్నారు. సీపీఐ 1వ డివిజన్ రెండో మహాసభ అడ్డగర్ల లక్ష్మీ ఇందిర అధ్యక్షతన ఆండాళ్లమ్మ తోటలో సోమవారం నిర్వహించారు. ప్రభాకర్ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్మిక పండుగ మేడేను ఏలూరు నగరంలోని వాడవాడలా జెంఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, సహాయ కార్యదర్శిగా, వెదురుపర్తి శారదను ఎన్నుకున్నారు.

విద్యార్థికి అభినందనలు


విద్యార్థి రఫీని అభినందిస్తున్న వైస్ చాన్సలర్

దెందులూరు: ఆంధ్ర యూనివర్సిటీ జరిగిన లోగో కాంటెస్ట్‌లో ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి శేఖర్ రఫీ తన అద్భుత ప్రతిభను చాటాడు. సోమవారం వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లో వైస్ ఛాన్సలర్ రాజశేఖర్ లోగో కాంటెస్ట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థి రఫీని ఘనంగా సత్కరించారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం మనోహర్, గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, గ్రామ నాయకులు తోట రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ ప్రత్యేకంగా అభినందించారు.

రైతులకు చేరువలో ఐఫీడ్


లక్ష్మీ ఆక్వా ఫీడ్స్, సీడ్స్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎండీ ఏవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు

పెదపాడు: ఆక్వారైతులకు నాణ్యమైన ఫీడ్‌ను చేరువ చేస్తున్నట్లు దీపక్ నెగ్జస్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ వక్తలు తెలిపారు. పెదపాడు మండలంలోని గుడిపాడు గ్రామంలో లక్ష్మీ ఆక్వా ఫీడ్స్ అండ్ సీడ్స్ దుకాణాన్ని సోమ వారం ప్రారంభించారు. ఈ కంపెనీ టెక్నికల్ డైరెక్టర్ ఎంవీడీ మల్లేశ్వరరావు, ఐఫీడ్ సీఈఓ ఏ వీ శేషాద్రి, వాల్విన్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టరు కురెళ్ల రాఘవేంద్ర ప్రభు పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఐఫీడ్ హెచ్ఎండీ రాజేశ్వరరావు హెచ్‌సీపీ ప్రోడక్ట్స్ హెచ్ఎం జీ దుర్గాప్రసాద్ సీనియర్ ఆర్ఎం శివనాగరాజు మరియు ఆక్వా రైతులు పాల్గొన్నారు.